# శిక్ష

ఛెళ్ళు మంది కొరడా!
భళ్ళు మంది చిన్నాయ్ గొంతు!
ఝల్లు మంది ముత్యాలు గుండె!

అదొక పల్లెటూరు. ఊరంతా రచ్చబండ దగ్గర చేరింది.

ముత్యాలు అభియోగం ఏమిటంటే ఇంటికి పైసా ఇవ్వదు మొగుడు, అంతా తీసికెళ్ళి "ఆ ముండ" కెడతాడు; చిత్తుగా తాగొచ్చి, అర్థరాత్రి ఆకలని కేకలెడతాడు; మర్నాడు తను పనిలో కెళ్ళడానికి అట్టే పెట్టుకున్న చద్దన్నం తినేస్తాడు; చేసే అల్లరంతా చేసి, చివరికి తనని కొడతాడు. ఏదైనా కొంచెం నోరు తెరిస్తే, మరీ రేగిపోయి నానా తన్నులూ తంతాడు. ఇల్లూ ఒళ్ళూ గుల్లయిపోయే ఈ నిచ్చ జాగరణ కన్న — రచ్చకెక్కడమే మేలనుకుంది ముత్యాలు.

రచ్చ తీర్చిన పెద్దలకి పెద్ద ఇబ్బందేమీ కలగలేదు. చుట్టుపక్కల నలుగురిళ్లల్లో తెలిసిన భాగోతమే కదా! తకతకా అన్నీ బయటపడి పోయాయి.

చిన్నాయ్‌గాధు నోరెత్తలేదు. "ఆ ముండ" తలెత్తలేదు.

"శిక్ష ఏమిటి?" అన్నాడు కరణం.

"గుంజకట్టేసి — ముత్యాలు ఆపమనే దాకా కొరడా దెబ్బలు?" అన్నాడు మునసబు.

"అంతే!" అన్నాడు నాయకుడు.

ఝల్లుమన్న ముత్యాలు గుండె తిరిగి కొట్టుకునే లోపల రెండో దెబ్బ పడింది, మొగుడి మీద. మొదటి దెబ్బకి కందదేలిన మొగాడి వీపు రెండో దెబ్బకి నెత్తురు చిమ్మింది. మూడో దెబ్బకి మూర్ఛ వచ్చినంత పనైంది.

మునసబుగారి కాళ్లమీద పడిపోయింది ముత్యాలు —

"బాబ్బాబు! సచ్చిపోతాడండి బాబు! ఇంకొదిలేయండి బాబు! ఆదు సచ్చిపోతే నేనెందుకు బాబు బతకడం? ఆడికి బుద్దొస్తే, నా కష్టాలు గట్టెక్కుతాయని గాని — ఆడు సచ్చిపోవాలని కాదుగద బాబు!?" — అని లబలబ లాడింది.

అంతే!! ఆనాటి నుంచి, మళ్ళీ "ఆ ముండ" పేడా, తాడిచెట్టు నీడా ఎరగదు ముత్యాలు! ముత్యాలుని ప్రాణంలాగా చూసుకోసాగాదు చిన్నాయ్‌గాడు!

ఇది ఏనాడో జరిగిన కథ!

ఇప్పుడా ఊరు బాగా బలిసింది. గడుసుదేరింది. రచ్చబండ తీర్పులూ, కొరడా దెబ్బలూ మొదలైనవి అనాగరికమూ, అశాస్త్రీయమూ, అయిపోయాయి! ఊరి చివరి తాడిచెట్లు పోయాయి! ఊరి మధ్య ఓ రెండు ప్ర.సా.దు.లు వెలిశాయి!

పంచాయతీ ఏమిటి? నాన్సెన్స్!! గో టు కోర్ట్! అది నచ్చకపోతే పెద్ద కోర్ట్! అదీ నచ్చకపోతే ఇంకా పై కోర్ట్! అదీ నచ్చకపోతే...




ఇదిపరకు చిన్నాయ్‌గాడున్న పాక ప్రాంతాల ఇప్పుడొక చిన్న డాబా వెలిసింది. అందులో ఓ చిన్నబ్బాయి గారుంటున్నాడు. చిన్నబ్బాయి గారి భార్య సీతాలు కాపరానికొచ్చి ఏడాదైంది.

సీతాలు రూపవతీ, సుగుణవతీ, చదువుకున్నదీ, పనిమంతురాలూ! కట్నం కూడా బాగానే తెచ్చింది, కాని పాపం చిన్నబ్బాయ్ గారే మద్రాసులో బాగా నలిగొచ్చిన ఓ బంపర్ భామతో సిటీలో రోజూ ఓ సిటింగ్ వేసి, రాత్రికి తూలుకుంటూ వస్తాదు. వాసన భరించలేక ముక్కు మూసుకునే ముద్దొచ్చే సీతాల్ని మొద్దుగా నాలుగ్గుద్దులు గుద్ది, ఆపై బుద్ధిగా బబ్బుంటాడు.

ఓరోజు రాత్రి భామనీ, బాటిల్‌నీ ఏకాయెకి ఇంటికి తీసుకొచ్చేసిన చిన్నబ్బాయ్ గారి ప్రవర్తనని సహించలేని సీతాలు గుమ్మంలో నిలేసింది. "ఏమిటిది?" అని అడిగింది.

తెల్లారేటప్పటికి గ్యాస్ పొయ్యి లీకై — సీతాలు చచ్చిపోయిందన్న వార్త గుప్పుమంది.

సీతాలు పుట్టింటివారు — అది "యాక్సిడెంటు" కాదన్నారు. ఎటుపోయి ఎటొస్తుందోనని చుట్టుపక్కల నలుగురూ నోళ్లు నొక్కేసుకున్నారు. పంచాయతీ పంచెలకి గోచీలు ఏనాడో ఊడిపోయాయి!

ఊళ్ళోని పంచాయతీ వల్లా, చుట్టుపక్కల నాలుగిళ్లవల్లా కాని పని — పై నెక్కడో ఉన్న కోర్టు వల్ల అవుతుందా! అక్కడా కాక కేసు ఇంకా పైకోర్టు కెళ్ళింది.

అలా పైపైకి పాకి పాకి, కేసు ఇంకా సాగుతూనే ఉంది. చిన్నబ్బాయి గారికి మళ్ళీ సంబంధాలొస్తున్నాయి. అబ్బాయిగారు సిద్ధంగానే ఉన్నాడు.

విశ్వనాథ పావనిశాస్త్రి